క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణంతో తొలగిన ఇబ్బందులు



పాన్‌గల్: మండలంలోని బహదూర్‌గూడెం నుంచి ప్రధాన రోడ్డు వరకు ఉన్న మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా మార్చడంతో ఇబ్బందులు తొలిగాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామం నుంచి ప్రధాన రోడ్డు వరకు ఉన్న 550 మీటర్ల సీసీ రోడ్డును రూ.56 లక్షల నిధులతో నిర్మించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డుతో గ్రామస్తులు ఇబ్బందులకు గురయ్యారని, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించడంతో సీసీ రోడ్డు నిర్మాణం త్వరితగతిన నిర్మించినట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాముయాదవ్ పేర్కొన్నారు.

టిప్పర్, బైక్ ఢీ



గోపాల్‌పేట: రేవల్లి మండలంలో బుధవారం మధ్యాహ్నం సమయంలో కంకర తీసుకువెళ్లే టిప్పర్ బైకును ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం బాధితుడిని అక్కడి నుంచి ఆస్పత్రికి తీసకువెళ్లారు. ఇదే విషయంపై రేవల్లి ఎస్‌ఐని వివరణ కోరగా.. తిమ్మాజిపేట మండలం కడుకుర్తి గ్రామానికి చెందిన పరశురాం గా గుర్తించామని తెలిపారు. ఫిర్యాదు చేసేందుకు ఎవరూ రాలేదని, ఎవరైనా పిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని చెప్పారు. అయితే నిత్యం ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా పట్టించుకునేవారు కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వ్యక్తి అదృశ్యం



మదనాపురం: మండలంలోని రామన్‌పాడులో మంగళవారం మధ్యాహ్నం నుంచి గ్రామానికి చెందిన వాల్మీకి చెన్నరాయుడు తప్పిపోయాడని గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం వెతకడంతో రామన్‌పాడు రిజర్వాయర్ ఒడ్డున ఆయన దుస్తులు, చెప్పులు లభించాయని గ్రామస్తులు తెలిపారు. ప్రాజెక్టు జలాశయంలో మిస్సింగ్ అయినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

తాపీ మేస్త్రీలకు శిక్షణ



పెబ్బేరు రూరల్: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, లేబర్ డిపార్ట్‌మెంట్ వనపర్తి వారి సహకారంతో బుధవారం శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం రైతువేదికలో తాపీ కార్మికులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్ కార్డు కలిగి ఉన్న వారందరికీ ఇక్కడ 15 రోజుల పాటు ఎలక్ట్రీషన్, ప్లంబర్, పాల్‌సీలింగ్‌లో శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్ అందిస్తామని తెలిపారు. శిక్షణ కాలంలో ఒక్కొక్కరికి 15 రోజులకు స్టైఫండ్ కింద రూ.4,500 అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు శివశంకర్, గంగాధర్, కార్మికులు సుల్తాన్, రాములు, పరశురాం, బాలరాజు, అంజి, చిన్న మొగులయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ కార్యదర్శికి సన్మానం



వనపర్తి: ఇటీవల జిల్లా ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) కార్యదర్శిగా ఎన్నికైన జిల్లెల సురేందర్‌రెడ్డిని అసోసియేషన్ సభ్యులు బుధవారం కలెక్టరేట్ ఆవరణలో సన్మానించారు. దశాబ్దాలుగా క్రీడల అభివృద్ధి కోసం కృషి చేసిన ఆయనకు ఈ పదవి సముచిత స్థానంగా భావిస్తున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుమార్ చెప్పారు. కార్యక్రమంలో నిరంజన్‌గౌడ్, రామ్మోహన్, వహీద్, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

పాన్‌గల్: మండలంలోని దొండాయిపల్లి నర్సరీని బుధవారం ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఏపీఓ కుర్మయ్య సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సరీలో మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పట్టాలని, బాగా పెరిగిన మొక్కలను వేరుగా చేసి నాటేందుకు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. దీంతో పాటు హరిత హారంలో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా గుంతలను సిద్ధంగా ఉంచాలని సూచించారు



అభివృద్ధి చూసి ఓర్వలేకే విమర్శలు

- 50 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ ఏం చేసింది
- అసత్యాలు ప్రచారం చేయడమే బీజేపీ పని
- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి



దుప్పల్లిలో విద్యార్థులతో ముచ్చటిస్తూ..



మట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మదనాపురం: కేంద్రంలో తొమ్మిదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఎన్ని నిధులు మంజూరు చేసిందో చెప్పాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలో బుధవారం ఎమ్మెల్యే నిర్వహించిన పర్యటన వాడి వేడిగా జరిగింది. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలో రూ.37 లక్షలతో నిర్మాణం చేసిన ఎమ్మార్సీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రూ.10 లక్షలతో మహిళా సమైక్య భవనానికి, మార్కెట్ యార్డ్ స్థలంలో రూ.20 లక్షలతో హెల్త్ సబ్ సెంటర్‌కు భూమి పూజ, లక్ష్మీపురం నుంచి నెలివిడితండా వరకు రూ.1.03కోట్లతో బీటీ రోడ్డు పనులకు, కొత్తపల్లిలో రూ.5 లక్షలు వెచ్చించి అండర్ డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. దుప్పల్లిలో రూ.5 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని, మన ఊరు మనబడి ద్వారా రూ. 26.40లక్షలు వెచ్చించి నిర్మాణం చేసిన పాఠశాలను ప్రారంభించారు.

కష్టపడి చదవండి

కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎమ్మెల్యే ఆల విద్యార్థులకు సూచించారు. దుప్పల్లిలో మన ఊరు మన బడి పనులు ప్రారంభించిన అనంతరం తాను చదువుకునే రోజులను ఎమ్మెల్యే విద్యార్థులతో పంచుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్న తను ఇంజినీర్ పూర్తి చేశానని తెలిపారు.

కేసీఆర్‌తోనే సంక్షేమం

అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి పథకాలతో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారని కొనియాడారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా, దళితబంధు తదితర పథకాలను వినియోగించుకున్న వారందరూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో పేదలకు చేసిందని ప్రశ్నించారు. మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో గెలిచేందుకు తప్పుడు ప్రచారానికి తెరలేపారని మండిపడ్డారు. కేంద్రంలో తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు ఏమీ చేసిందో చెప్పే ధైర్యం కూడా ఆ పార్టీ నాయకులకు లేదని ఎద్దేవా చేశారు. నిత్యావసర ధరలను పెంచి పేదలపై భారం మోపారని దుయ్యబట్టారు. అనంతరం కల్యాణలక్ష్మి, రైతుబీమా చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్య, మార్కెట్ చైర్మన్ శ్రావణ్‌కుమార్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, బీఆర్‌ఎస్ మహిళా విభాగం నియోజకవర్గం అధ్యక్షురాలు జయంతి, అధ్యక్షుడు యాదగిరియాదవ్, సర్పంచులు శివశంకర్, రాంనారాయణ, కోట్ల రాములమ్మ, అరుణ, నరేందర్, ఎంపీడీఓ నాగేంద్రం, ఎంఈఓ కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అయ్యప్ప పూజలు



అయ్యప్ప మహాపడి పూజ చేస్తున్న భక్తులు

అమరచింత: పట్టణంలో నిర్మించిన హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయ ఆరో వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు బుధవారం కనులపండువగా కొనసాగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక అభిషేకంతో పాటు పూజలు చేశారు. వేద పండితులు హోమం నిర్వహించారు. గురుస్వామి మహంకాళి నరసింహులు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామివారి మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహిస్తున్న సమయంలో భక్తుల అయ్యప్ప నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. వార్షికోత్సవ పూజలకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం అన్నదానం చేసిన ప్రశాంత్‌కుమార్‌రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు శాలువ, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మాజీ ఎంపీటీసీ మహంకాళీ విష్ణు, జుబేర్‌అహ్మద్, మన్నన్, వెంకటేశ్వర్‌రెడ్డి, చాంద్‌పాషా, హరీష్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు మనోహర్‌రాజు, నరసింహులు, రమేష్, తొకలి రమేష్, మహేందర్‌రెడ్డి, మేర్వరాజు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

వనపర్తి టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని టీఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు బుధవారం టీఎస్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయ అధికారికి పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతూ.. అవినీతి పాలనతో రాష్ట్రాన్ని కేసీఆర్ నాశనం చేస్తున్నాడని మండిపడ్డారు. కార్యక్రమంలో కళ్యాణ్, శంకర్, వంశీ, నాగరాజు, అనిల్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

పెబ్బేరు: గ్రామాల్లో బీఆర్‌ఎస్ బలోపేతం చేసేందుకు కార్యకర్తలందరూ కృషి చేయాలని మండల అధ్యక్షుడు వనం రాములుయాదవ్ అన్నారు. బుధవారం అయ్యవారిపల్లి, గుమ్మడంలో ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై వివరిస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. సర్పంచ్ స్వాతి, ఉప సర్పంచ్ మద్దిలేటి, ప్రభాకర్‌గౌడ్, మధు, యాదగిరి, గోవిందు నాయుడు, రణధీర్‌రెడ్డి, గోవర్ధన్, బాబురెడ్డి, చెన్నయ్య, అంజనేయులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి



మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్, వైస్‌చైర్మన్

ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలో స్థానిక ప్రజల సహకారంతోనే అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా చేపడుతున్నామని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. బుధవారం పురపాలిక కార్యాలయం ఆవరణలో రూ.50లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పార్కు పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సహకారంతో పట్టణంలో ఇదివరకే రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పార్కులో 16 రకాల పూల, ఇతర 40 రకాల మొక్కలు నాటడంతో పాటు వాకింగ్‌ట్రాక్‌ను నిర్మిస్తున్నామన్నారు. స్థానికులు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, నాయకులు మోసీన్, గడ్డమీది శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని వినతి



వీపనగండ్లలో ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ వర్కర్లు

వీపనగండ్ల: గ్రామాల్లో అనునిత్యం పరిశుభ్రత కోసం అహర్నిశలు పనిచేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లను గ్రామ పంచాయతీ శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ సంస్థ అయిన గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణాచారి, జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. కార్మిక సమస్యలు పరిష్కరించకుంటే 6వ తేదీ నుంచి తెలంగాణ గ్రామపంచాయితీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, ఈశ్వరమ్మ, కృష్ణారెడ్డి, నర్సింహ, గంగమ్మ, రాములమ్మ, సుంకులమ్మ పాల్గొన్నారు.

పాన్‌గల్: గ్రామ పంచాయతీ వర్కర్లను రెగ్యూలర్ చేయాలని డిమాండ్‌తో చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన నోటీసును సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డికి అందజేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఈనెల 6వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాము, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై దాడికి నిరసనగా ధర్నా



దర్నా చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు మద్దతుగా మాట్లాడుతున్న ఎంపీపీ తదితరులు

ఖిల్లాఘనపురం: పందులను తరలించే క్రమంలో ఖిల్లాఘనపురం పంచాయతీ కార్యదర్శి రవితేజపై దాడికి నిరసనగా బుధవారం అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, పారిశుద్ధ్య కార్మికులు పెద్ద ఎత్తున మండల కేంద్రంలోని బస్టాండుకు చేరుకుని రోడ్డుపై బైటాయించారు. వారికి మద్దతుగా ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సామ్యనాయక్, తహసీల్దార్ పరమేశ్వర్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంపీఓ రాజు, మండల టీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాళ్లకృష్ణయ్య, జిల్లా మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సర్పంచులు వెంకటరమణ, ఉప సర్పంచులు, యువత ధర్నాలో పాల్గొన్నారు. బస్టాండు నుంచి ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఎస్‌ఐ శ్రీహరికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తదితరులు మాట్లాడుతు గ్రామాల్లో అనుమతులు లేకుండా పందులను పెంచడమే కాకుండా పంచాయతీ కార్యదర్శిపై దాడికి దిగడం అహంకారానికి నిదర్శనమన్నారు. పందులను తొలిగించే అధికారం గ్రామ పంచాయతీకి ఉంటుందని వారు తెలిపారు. దాడి చేసిన నిందుతులపై చట్టపరంగా చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

మోదీ పాలనలో సంక్షేమ ఫలాలు



చందాపూర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి టౌన్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కృష్ణ అన్నారు. ఈ మేరకు జిల్లాలోని చందాపురంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ రాష్ట్రాన్ని నాశనం చేస్తూ.. కేంద్ర పథకాలను ప్రజలకు దూరం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేవేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు రామన్న గారి వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు పెద్దిరాజు, హరినాథ్‌రెడ్డి, దాకేష్, ఎల్లస్వామి పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

చిన్నంబావి: భారతీయ జనతా పార్టీ చిన్నంబావి మండల నూతన కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల ఆశీర్వాదాలు తమకు ఉన్నాయని, ముఖ్యంగా చిన్నంబావి మండలం నుంచే పాదయాత్ర మొదలుపెట్టి బ్రహ్మాండంగా ముగించామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జగ్గరి శ్రీధర్‌రెడ్డి, కుర్మయ్య, కిరణ్‌కుమార్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

శక్తి కేంద్రాలు పటిష్టం చేసేందుకు కృషి



ఖిల్లాఘనపురంలో..

ఖిల్లాఘనపురం: ప్రతి మండలంలోని శక్తి కేంద్రాలు, బూత్‌లను పటిష్టం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని విస్తారక్ అభిషేక్‌జీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో శక్తి కేంద్రాలు, బూత్‌లను పటిష్టం చేసే కార్యక్రమంలో భాగంగా నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అప్నాబూత్ సే మజ్బూత్ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అందులో భాగంగానే వాటి పటిష్టత కోసం తరుచుగా సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ బలపడినప్పుడే ప్రజల మద్దతు పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, రాంరెడ్డి, బుచ్చిబాబుగౌడ్, ఆశన్న, అంజనేయులు, శివశంకర్, రవీంద్రాచారి, చక్రవర్తి, ఈదమ్మ, అంజి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాసర ట్రిబుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక



కొత్తకోట రూరల్: బాసర ట్రిబుల్ ఐటీలో పెద్దమందడి మండలం చీకురుచెట్టుతండాకు చెందిన విద్యార్థిని సంధ్య సీటు సాధించింది. మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, పెబ్బేరులో చదివిన సంధ్య పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించడంతో బాసర ట్రిబుల్ ఐటీకి దరఖాస్తు చేసుకుంది. ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో మొదటి లిస్టులోనే సీటు సాధించడంపై తండా వాసులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

పనికి తగిన కూలి చెల్లించాలి

గోపాల్‌పేట: ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు పెంచడంతో పాటు వారి పనికి తగిన కూలి అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని మున్ననూరు శివారులో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడారు. రోజుకు రూ.ఆరు వందల కూలి, పనిముట్లు ఇవ్వాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధికి ఈ ఏడాది 30 శాతం నిధులు తగ్గించడం ఏంటని ప్రశ్నించారు. పనిని మున్సిపాలిటీల్లోకి విస్తరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కావలి రాములు, శాంతమ్మ, మనెమ్మ పాల్గొన్నారు.



ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలి



లేఖలు చూపుతున్న నిరుద్యోగులు

ఆత్మకూర్: వైద్య, ఆరోగ్య శాఖలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావుకు నిరుద్యోగులు లేఖలు రాశారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌కు చెందిన ఎంపీహెచ్‌ఏ కోర్సును పూర్తి చేసుకున్న నిరుద్యోగులు మాట్లాడుతూ రాష్ట్రంలో 4 వేల మంది నిరుద్యోగులు ఉన్నారన్నారు. వైద్యశాఖలో నెలకొన్న ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని, పారామెడికల్ విభాగంలో ఎంపీహెచ్‌ఏ పోస్టులను కూడా భర్తీ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహేందర్, చందు, జ్ఞానతేజ్, నవీన్, విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

వనపర్తి: రానున్న సాధారణ ఎన్నికలు జిల్లాలో సజావుగా నిర్వహించేందుకు ఆయా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్ కోరారు. బుధవారం స్థానిక ఈవీఎం గోదాంను రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో సందర్శించారు. అందులో సరిగా పని చేయని 17 బ్యాలెట్ యూనిట్లు, 3 కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌కు మరమ్మతు కోసం హైదరాబాద్ ఈసీఐఎల్‌కు తరలించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో కలెక్టర్ రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఎస్‌ఎస్‌ఆర్ ఎలక్ట్రోరల్ రోల్ జాబితా, నూతన ఓటర్ల నమోదు, పోలింగ్ స్టేషన్ల మార్పు, పార్టీ తరఫున బూత్ లెవల్ ఏజెంట్ల నియామకంపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఓటరు నమోదు కోసం 3547 దరఖాస్తులు వచ్చాయన్నారు. తుది ఓటరు జాబితా అక్టోబర్ 4వ తేదీన విడుదల చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో 290 పోలింగ్ స్టేషన్లు 175 లొకేషన్లలో ఉన్నాయని వాటిని మార్చేందుకు అవకాశం ఉన్న వాటి ప్రతిపాదనలు పంపించాలని తెలియజేశారు. బీఎల్ఓ ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో యువతకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. 80ఏళ్లు దాటిన వారు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం ఎన్నికల కమీషన్ కల్పించిందన్నారు. సమావేశంలో ఆర్డీఓ పద్మావతి, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ రమేష్‌రెడ్డి, బీజేపీ తరపున ఆర్. వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ తరపున వేణాచారి, కొండారెడ్డి, ఎంఐఎం తరపున ఎంఏ రహీమ్, సీపీఎం తరపున ఎండీ జబ్బార్, సీపీఐ తరుపున రమేష్, టీడీపీ నుంచి సయ్యద్ జమీలుల్లా పాల్గొన్నారు.

నాసిరకం వంతెన నిర్మాణంపై ఆందోళన

- మూడు గంటల పాటు ప్రధాన రహదారిపై రాస్తారోకో
- ఎస్‌ఐ హామీతో శాంతించిన గ్రామస్తులు



రాస్తారోకో చేస్తున్న కొంకనవానిపల్లి గ్రామస్తులు

అమరచింత: స్థానిక రైతులతో పాటు మద్దూరు గ్రామానికి వెళ్లడానికి వీలుగా నూతనంగా నిర్మించిన వంతెన పనులు నాసిరకంగా చేశారని కొంకన్‌వానిపల్లి గ్రామస్తులు కన్నెర్ర చేశారు. రూ.ఐదు లక్షలను మట్టిలో పోశారని, అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ బుధవారం మరికల్, ఆత్మకూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఎస్‌ఐ శివనాగేశ్వర్‌రెడ్డి రాస్తారోకో వద్దకు చేరుకొని ఆందోళన విరమించాలని వేడుకున్నా.. స్థానికులు మూడు గంటల వరకు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పదేళ్ల నుంచి మద్దూరు గ్రామానికి వెళ్తున్న కచ్చ రహదారిలో వంపు ఉన్న కారణంగా వర్షాకాలంలో వంపు నీటిని దాటలేకపోతున్నామని స్థానిక ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి విన్నవించడంతో గతేడాది రూ.ఐదు లక్షలు మంజూరు చేశారని తెలిపారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

నిర్మాణ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ వంపు లోతును గుర్తించలేక వంపు చివరన మూడు పైపులు వేసి వాటిపై వంతెన కట్టి తూతూమంత్రంగా మట్టితో నింపారని అసహనం వ్యక్తం చేశారు. రెండు రోజుల కిందట కురిసిన వర్షానికి వంపులో నీరు చేరి వంతెన కూలిపోయే స్థితికి చేరిందన్నారు. నాసిరకంగా వంతెన నిర్మాణ పనులకు ప్రోత్సహించిన ఏఈ ధర్మరాజుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఈ ధర్మరాజు నిర్లక్ష్యం కారణంగా గ్రామంలో నిర్మించిన డ్రెయినేజీలతో పాటు సీసీ రహదారులు సైతం నాసిరకంగా ఉన్నాయని ఆరోపించారు. ప్రజాధనాన్ని దుర్వినియోగ పరుస్తూ ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే సైతం అవినీతి పరులకు ప్రోత్సహించడం ద్వారానే ఇలాంటి నిర్మాణ పనులు జరిగాయని ఆరోపించారు. ఇప్పటికైనా మరోమారు వంతెనను నూతనంగా నిర్మించాలని కోరారు. ఈ వ్యవహారంలో సంబంధిత పంచాయతీరాజ్ డీఈతో ఎస్‌ఐ శివనాగేశ్వరనాయుడు ఫోన్‌లో మాట్లాడి విషయాన్ని వివరించారు. స్వయంగా వచ్చి సమస్యను పరిష్కరించాలని సూచించారు. మూడు రోజుల వ్యవధి ఇవ్వాలని డీఈ కోరడంతో ఎస్‌ఐ స్థానికులతో మాట్లాడి వంతెన పనులు పూర్తి స్థాయిలో జరుగుతాయని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో పెద్ద శ్రీను, దేవర్ల రవి, కుతుబ్, వెంకటన్న, కురుమన్న, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.